# విభిన్న ధృవాలు

శ్రీ తిరుమల వెంకటేశ్వర్లు

విజయలక్ష్మి, ఇరువురు పిల్లలు భోజనాల దగ్గర కూర్చున్నారు. ఆమె పెద్ద కొడుకు రఘు ఇంకా తాలూకాఫీసునుంచి రాలేదు. రెండో కొడుకు శేఖర్ యింకా కాలేజినుండిరాలేదు.

విజయలక్ష్మి కుటుంబం ఒకప్పుడు బాగా బ్రతికింది. కాని భర్త మరణంతో కుటుంబ స్థితి మారింది. అలాగే కష్టపడి కొడుకులను చదివించింది. పెద్దకొడుకు రఘుకు తాలూ కాఫీసుల్లో గుమాస్తాపని దొరికింది. రెండో కొడుకు శేఖర్ ఇంటర్ చదువుచున్నాడు. మిగిలిన ఇద్దరు ఆరు, మూడు సంవత్సరముల వయస్సుగల ఆడపిల్లలు.

రఘు ఆఫీసునుండివచ్చి భోజనం దగ్గర కూర్చున్నాడు. విజయలక్ష్మి "శేఖర్ యింకా కాలేజినుండిరాలేదురా!" అన్నది.

"కాలేజిలో మళ్లా ఏంగొడవ తెచ్చు కొన్నాడో!" అన్నాడు రఘు.

భోజనాలు ముగిసినవి. గంట రెండ యింది. అంతలో శేఖర్ వచ్చాడు.

"ఏరా! ఇంత ఆలస్యమైంది?" అంది తల్లి.

"ఈ రోజు కాలేజిలో విద్యార్థుల బహి రంగసభ. సభకు కావలసిన అరేంజి మెంట్స్ చేసి వచ్చేటప్పటికి ఇంత ఆలస్య మైంది"

"సభ దేనికిరా?" అన్నాడు రఘు.

"ఇప్పుడు కాలేజిలో చదువు తగ్గి పోయింది. లెక్చరర్లకు లంచాలు, వ్యస నాలు ఎక్కువైనాయి. లెక్చరర్లు షోకుగా టాయ్ లెట్ అయి వస్తారు. రకరకాల పోజు లిస్తారు, కాని పాఠములేమో చెప్పేది లేదు. మావిద్యార్థులకు సరైన సౌకర్యాలులేవు. బిల్డింగు పూరిపాకలు. వర్షం వస్తే సెలవు. వీటినన్నిటినీ చూస్తూ ఊరుకోం!"

"ఏడవలేకపోయావ్! ఎవరెట్లాపోతే మధ్యలో నీకెందుకురా?"

"అవునుమరి, నీలాగే ఈ అన్యా యాలను చూస్తూ కూర్చోమంటావా?"

"నోర్ముయ్!" అంటూ శేఖర్ చెంపమీదబలంగా ఒకటి తగిలించాడు.

"ఏమిట్రా! వాడేదో తెలియక వాగితే పట్టుకొని కొడుతున్నావ్!" అంది తల్లి.

"వాడినింకా వెనకేసుకొనిరా! బాగు పడతాడు!" రఘు కోపంతో ఆఫీసుకు వెళ్ళి పోయాడు.

"ఏం కోపాలో ఏమో! రారా వచ్చి అన్నంతిను" అంది శేఖర్ తో తల్లి.

"ఛీ! వెధవిల్లు! నీవు, నీ పెద్ద కొడుకు హాయిగా ఉండండి. ఇక చస్తే ఈ యింట్లో అడుగు పెట్టను."

శేఖర్ గబగబ వెళ్ళిపోయాడు.

శేఖర్‌కు పెట్టిన అన్నం పిల్లివచ్చి తిని పోయింది. విజయలక్ష్మి గుండె తరుక్కొని పోయింది.

♦ ♦ ♦

ఆ సాయంత్రంకాలేజిలోబహిరంగసభ. సభకు విద్యార్థులు, విద్యార్థినులు చాల మంది వచ్చారు. శేఖర్ లేచి స్టేజియెక్కి కాలేజిలోని అన్యాయాలను గురించి యుపన్యాసమిచ్చాడు. లెక్చరర్లలంచము, కల్చరల్ ఈజీతానికి సరియైన సౌకర్యములు లేక పోవుట, కొన్ని దండుగఫీజులు, పాకల బిల్డింగు మొదలగు విషయాలను గురించి గంభీరంగా యుపన్యాసమిచ్చాడు. అందరూ శేఖర్ కంఠధ్వనికి, ధైర్యానికి ఆశ్చర్య పోయారు. సభ జయప్రదంగా ముగిసింది.

అంతలో శేఖర్ ప్రియమిత్రుడు ఆనంద్ పరుగెత్తుకుంటూ వచ్చి "శేఖర్! సెలక్షన్సులోనెగ్గినవారి లిస్టు వేశారు. దాని లోనీ పేరు లేదు" అన్నాడు.

శేఖర్ ఆశ్చర్యపోయాడు. తను సెలక్షన్సులో తప్పుతానని కలలోగూడ అనుకో లేదు. గబగబ వెళ్ళి లిస్టు చూశాడు. తన పేరులేదు. నమ్మలేకపోయాడు. గబగబ ప్రిన్సిపాలు దగ్గరకు వెళ్ళి అడిగాడు. ప్రిన్సిపాలు కోపంతో ఉరిమిచూస్తూ-

"వచ్చావులే! పెద్ద చదివేవాడు బయలు దేరాడు! ఇంకా స్త్ర లెక్చర్లుయివ్వు! బాగు పడతావ్"

"దానికీ దీనికి సంబంధం ఏమిటండీ?"

"ఇదే-ఫస్ట్ గెటవుట్?"

శేఖర్ అవమానంతో బయటకు వచ్చాడు. మసక చీకటి పడింది. కొందరు విద్యార్థులు శేఖర్‌ను చూసి హేళనగా నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

శేఖర్ రోడ్డుమీద నడుస్తున్నాడన్న మాటేగాని మనస్సు మనస్సులోలేదు. ఇక గత్యంతరం ఏమిటి? తొందరపాటుతో, ఆలోచనలేక యింటికి వెళ్ళనన్నాడు- మరియిప్పుడు ఎక్కడకు వెళ్ళడం!

తనజీవితంలో ఇంతవరకూ ఎక్కడా అపజయం పొందలేదు. ఇదే మొదటిసారి తప్పటం. భావి అపజయాలకుఇది పునాదా?

వెనక కారుహారన్‌తో ఉలిక్కిపడ్డాడు. డ్రైవర్ కోపంతో "ఏమయ్యా! రోడ్డు మీద మధ్యలోనడువకూడదనీ తెలీదూ!" అని కారు వెళ్ళిపోయింది.

శేఖర్ మెల్లిగా రైల్వే స్టేషన్‌చేరు కొన్నాడు. గంట ఎనిమిది దాటింది. స్టేషనంతా కోలాహలంగాయుంది.

మద్రాసు మెయిలు వచ్చింది. శేఖర్ ఎక్కి కూర్చున్నాడు. 'తను చేస్తున్నపని తప్పేమో?' అన్నది మనస్సు. 'లేకుంటే గత్యంతరం!' అన్నది హృదయం.

మెయిలు బయలుదేరింది. మరోనిము షంలో అంతవరకు నివసించిన స్వగ్రామమును, బంధువులను, కాలేజిని అందరినీ విడచి ఎక్కడికో దూరంగా వెళ్ళి పోయాడు శేఖర్.